'అంటే అలాంటి దిక్కుమాలిన విషయం 'కూర్చోండి ..... ప్లీజ్ బాబూ......'

నాగరాజు రామయ్య వంక విసుగ్గా చూసి సోఫాలో కూర్చున్నాడు.

"ఇప్పుడు చెప్పు మామయ్యా దేనిగురించి నువ్వు మాట్లాడు తున్నావు?'

"సరిగ్గా కూర్చోండి బాబూ.... అలా సోఫా అంచున కూర్చుంటే నడుం నెప్పెట్టింది..... వెనక్కి జారగిలబడి హాయిగ సుఖంగా కూర్చోండి బాబూ.....'

"నీకు తెలీదు దేని గురించి అడుగుతున్నాను.... హు..... దిక్కు మాలిన వేషాలు ..... నీకు ఇదివరకే పెళ్ళి కాలేదూ?....'

నాగరాజు ఉలిక్కి పడ్డాడు.

"నాకా?.....ఇదివరకే పెళ్ళా?!'

"సరిగ్గా కూర్చోండి బాబూ.... నడుం నెప్పెట్టుది.....'

నాగరాజు చికాకుగా రామయ్య వంక చూసి సోఫాలో వెనక్కి జారబడి కుర్చున్నాడు.

"నేనింకా సరోజతో నాపెళ్ళి ఎప్పుడు జరిపిస్తావ్ అని అడగడానికి వచ్చాను....'

"ఏం తీస్కుంటారు బాబూ?.... టీయా, కాఫీయా లేకపోతే ఏదైనా కూల్ డ్రింక్ తీస్కుంటారా?......'

"అయినా ఏ దిక్కుమాలిన మొహం పెట్టుకుని సరోజతో పెళ్ళి జరిపించమని అడగడానికి వచ్చావ్?.... భీమూ.....' అంటూ పిలిచాడు రాజశేఖరం.

భీమేశ్వరరావు వచ్చాడు.

"ఆ ఫోటో తీస్కురా.....'

భీమేశ్వరరావు లోపలికి వెళ్ళాడు.

"చెప్పండి బాబూ..... ఏం తీస్కుంటారు బాబూ.....'

"ఏం వద్దు నువ్వు నన్ను వదులు'

"మా ఇంటికి వచ్చిన వాళ్ళు ఏమీ తీసుకోకుండా వెళకూడదు బాబూ...... ఏదో ఒకటి చెప్పండి బాబూ....'

ఏదో ఒకటి తే.....' నాగరాజు తలపట్టుకుని అన్నాడు.

రామయ్య వెళ్ళిపోయాడు.

భీమేశ్వరరావు ఫోటో తెచ్చి నాగరాజు చేతికి ఇచ్చాడు.

ఆ ఫోటోని చూస్తూనే నాగరాజు అదిరిపడ్డాడు.

అందులో తనూ, సుబ్బలక్ష్మి ఉన్నారు.

అసలు ఇద్దరూ కలిసి ఎప్పుడూ ఫోటో దిగలేదు. మరి ఇది ఎక్కడి నుండి వచ్చింది?.....

"బాబూ......కాఫీ బాబు ....' రామయ్య కాఫీ కప్పుతో వచ్చాడు.

నానెత్తిన పోయ్యి .....' కోపంగా అరిచాడు నాగరాజు.

"తప్పుబాబూ ..... అతిథుల నోట్లోనే ఏవైనా పోయాలిగానీ నెత్తిన పొయ్యకూడదు

బాబూ.......తాగండిబాబూ.....'

"దీనికేం అంటావు?......' రాజశేఖరం అడిగాడు.

"ఆ అమ్మాయి నేనూ కలిసి ఎప్పుడూ ఫోటో దిగలేదు....'

"కాఫీ బాబూ....'

"అంటే ఆ అమ్మాయి నీకు తెలీదంటావ్?..... ఆ దిక్కుమాలిన ఫోటో ఆకాశంలోంచి ఊడిపడిందంటావ్?.....'

"ఆ అమ్మాయి నాకు తెలుసుగానీ.... '

"ఇంక చాలు నువ్వెళ్ళొచ్చు.....'

"బాబూ కాఫీ తాగి వెళ్లండి బాబూ.....'

"దగా ..... కుట్ర ..... ' అరిచాడు నాగరాజు.

"ఇందులో దగా కుట్రా ఏమీలేదు బాబూ...... కాఫీలో విషమూ మత్తుమందూ ఏమీ కలపలేదు బాబూ ...... మంచి కాఫీనే బాబూ......'

నాగరాజు ఫోటో ముక్కలు ముక్కలుగా చింపేసాడు.

"నువ్వు దిక్కుమాలిన ఫోటో చింపినంతమాత్రాన నష్టమేమీ లేదు..... రాంబాబు నడిగితే కావలసినన్ని కాపీలు ఇస్తాడు.....'

"అయితే కాఫీ తాగరా? ..... కూల్ డ్రింక్ తాగుతారా?.....'

నాగరాజు ఆశ్చర్యంగా చూశాడు. అయితే ఇది రాంబాబు పన్నినకుట్రా?.....

"రాంబాబూ.....నీ పనిపడ్తాను?!.....'

పళ్ళునూరాడు నాగరాజు.

భీమేశ్వరరావు చొక్కావిప్పాడు.

"వద్దులే.....వాడినేమీ చెయ్యొద్దు?' అన్నాడు రాజశేఖరం కొడుకుతో.

భీమేశ్వరరావు విసుక్కున్నాడు.

"తన్నడానికి కాదులే..... అసలు ఇటువంటి వయసులో కూడా పెంచిన కండల్ని చూపించకపోతే ఎలా?'

"దగా..... కుట్ర .....మోసం ..... నేను ఆ రాంబాబుగాడి మీద ప్రతీకారం తీర్చుకుంటా......' అరిచాడు నాగరాజు.

ఈ అరుపులకి లోపలి నుండి లక్ష్మి సరోజ వచ్చారు.

భీమేశ్వరరావు లక్ష్మిని చూసి కెవ్వుమని చిన్నగా అరిచి చొక్కావేసేస్కుకున్నాడు.

"సరోజా .... నువ్వింతకు ఇంత అనుభవిస్తావ్ .... నన్ను కాదని నువ్వెలా సుఖపడ్తావో చూస్తా.....ఎలాగైనా నీ మెడలో నేనే తాళి కడ్తా.....'

"కట్టేముందు కాఫీ తాగండి బాబూ.....'

నాగరాజు చరచరా వెళ్ళిపోయాడు అక్కడినుండి.

"పోనీ మీరైనా తాగండమ్మా.... కాఫీ చల్లారిపోతుంది' లక్ష్మితో అన్నాడు రామయ్య.

"ఇప్పుడొద్దు రామయ్యా.....' అంది లక్ష్మి.

తీస్కో.. .... లేకపోతే వాడు వదలడు.....' సరోజ నవ్వుతూ అంది. లక్ష్మి రామయ్య చేతిలోని కాఫీ కప్పు అందుకుని తాగింది.

తరువాత ఇద్దరూ ఎక్స్‌పోజ్ చేసిన ఇస్మైల్ ప్లీజ్ ఫోటో స్టూడియోకి వెళ్ళారు. స్టూడియో తాళం వేసి ఉంది.

సరోజా, లక్ష్మి ముఖముఖాలు చూస్కున్నారు.

స్టూడియో ఎందుకు తెరవలేదబ్బా?!'..... ఒకవేళ రాంబాబుకి ఒంట్లో బాగోలేదేమో?!.....ఇంటికెళ్ళి చూసొద్దాంపద.....' అంది సరోజ.

స్టూడియో నుండి రాంబాబు ఉండే ఇంటికి అయిదు నిముషాలనడక.

లక్ష్మి సరోజా ఇద్దరు నడుచుకుంటూ రాంబాబు ఇంటికి వెళ్ళారు.

ఇల్లుకూడా వెనకవైపునుండి తాళం వేసిఉంది.

"ఇల్లుకూడా తాళం వేసిఉందే!..... స్టూడియో కట్టేసి వీళ్ళేదైనా సినిమాకి వెళ్ళారేమో.....' అంది లక్ష్మితో సరోజ.

"రాంబాబు కోసం వచ్చారామ్మా?' అంటూ వీళ్ళని చూసిన పక్కింటి ఆయన వచ్చాడు.

"అవును అంకుల్....' అన్నారు ఇద్దరూ.

"అతను, కిష్టయ్య మొన్న ఊరెళ్లారమ్మా. బహుశా వాళ్ళ సొంతూరు తాడేపల్లిగూడెం వెళ్లారనుకుంటా.'

ఇద్దరూ మెల్లగా నడచుకుంటూ చిక్కడపల్లి మెయిన్‌రోడ్డు మీదికి వచ్చారు.

"ఏం చేద్దాం ఇప్పుడు?' అడిగింది లక్ష్మి.

"ఏం చెయ్యడమేముందీ..... రాంబాబు వచ్చాక అతనికి ఫిల్మ్ డెవలప్ చేయడానికి ఇద్దాం' అంది సరోజ.

"నీ మొహం.... అతను సొంతూరే వెళ్ళాడో ఇంకెక్కడికైనా వెళ్ళాడో!..... ఎన్ని రోజులకి వస్తాడో ఏమో!! ఇక్కడే మరో ఫోటో స్టూడియోలో ఇచ్చేద్దాం'

చిక్కడిపల్లిలోనే మరో ఫోటోస్టూడియోలో ఫిల్మ్ డెవలప్ చేయడానికి ప్రింట్సు వేయడానికి ఇచ్చారు.

"రేపురాత్రి ఏడుగంటలకి రండమ్మా ఫోటోలు ఇచ్చేస్తాను' అన్నాడు స్టూడియోవాడు.

అక్కడనుండి సుదర్శన్ సినిమా హాలులో ఆడుతున్న "అల్లరిచిల్లరి చిన్నోడు' సినిమాకి వెళ్ళారు. వీళ్ళు వెళ్ళేసరికి సినిమా మొదలయింది.

చీకట్లో మెల్లగా తడుముకుంటూ వెళుతూ ఒక వరసలోకూర్చున్నారు. చెత్తసినిమానో ఏమో హాలంతా ఖాళీగా ఉంది.

చీకటి కాస్త కళ్ళకి అలవాటు అయ్యాక హాల్లోని జనం మసకగా కనబడసాగారు.

తమముందు వరుసలో కూర్చున్న జంటనీడల్లో కనిపిస్తారు సరోజకి లక్ష్మికి. వాళ్ళు ఒకరి మీద ఒకరు ఒరిగిపోయి సినిమా చూస్తున్నారు. మధ్య మధ్య ముద్దులు పెట్టుకుంటున్నారు.

"వీళ్ళకి రొమాన్సుకి సినిమాహాలే దొరికింది కాబోలు!....' లక్ష్మి సరోజతో మెల్లగా అంది.

"ష్.... వినబడుతుంది' సరోజ లక్ష్మి చెవిలో అంది.

ఇంటర్వెల్ అయింది. హాల్లో లైట్లు వెలిగాయ్.

ముందువరసలోని వాళ్లని చూడగానే వాళ్ళకి మతిపోయింది.

రంగనాధరావు!..... పక్కన ఎవరో అమ్మాయి!! చాల మోడ్రన్‌గా ఉంది.

రంగనాధరావు సరోజని చూడలేదు. అతని లోకంలో అతనున్నాడు.

మళ్ళీ లైట్లు ఆరిపోయి మళ్ళీ సినిమా మొదలయింది.

పెళ్లాం చచ్చిపోతే మాత్రం మగాడికి దిగులేముంది?..... వెంటనే మర్చిపోయి వేరే ఆడదాని వెంటపడతాడు.....' సరోజ కోపంగా గొణిగింది లక్ష్మితో.

సినిమా ఇంకా పావుగంట ఉంటుందనగా రంగనాధరావు, ఆ అమ్మాయి లేచి వెళ్ళిపోయారు.

* * *

రాంబాబు, కిష్టయ్య పొలాల గట్లమ్మట ఆ సాయంత్రంపూట షికారుగా నడుస్తున్నారు.

"చాల గమ్మత్తుగా ఉంది కదండీ గురూగారూ.... మనం నాగరాజుతో సరోజ పెళ్ళి సంబంధం చెడగొట్టడానికి ఏ అమ్మాయి పోటోనైతే ఉపయోగించామో అదే అమ్మాయి ఇక్కడ పెళ్ళిచూపుల్లో కూర్చోడం .....' కిష్టయ్య రేగుపండు పిక్కవొలిచి నోట్లో  పెట్టుకుంటూ అన్నాడు.

"ఆ అమ్మాయి పేరు ఏమని చెప్పారు?' రాంబాబు అడిగాడు.

"సుబ్బలక్ష్మి గురూగారూ....'

"ఆ.....ఆ..... ఆ సుబ్బల్‌క్ష్మి వేరే అబ్బాయిని ప్రేమించిందనీ.... ఆ అబ్బాయి నాగరాజనీ నా ఫ్రెండనీ .... కావాలంటే నేను హైద్రాబాద్ వెళ్లగానే వాళ్ళిద్దరూ తీయించుకున్న ఫోటో పంపిస్తానని నిన్న సాయంత్రం పెళ్ళిచూపుల నుండి ఇంటికి వెళ్లగానే మానాన్నకి చెప్పాను..... మొదట్లో మా నాన్నగారు నమ్మలేదు. నా మీదకి ఇంతెత్తున లేచారు. ఇటువంటి దొంగనాటకం వ్యవహారాలు నాదగ్గర చెల్లవ్.... అని అన్నారు. కానీ నేను హైద్రాబాద్ వెళ్ళగానే రుజువు కోసం ఫోటో పంపిస్తానని అంటే అప్పుడు శాంతించారు..... ఎలారూ మన దగ్గర ఆ ఫోటో నెగిటివ్ ఉందిగా ..... ఓ కాపీతీసి పంపిస్తే సరి!.....'

"ఒకే దెబ్బకి రెండుపిట్టలు అంటే ఇదే గురూగారూ.... ఆ ఒక్క ఫోటోతో అటు సరోజ పెళ్ళి సంబంధం చెడిపోయింది ఇటు మీ పెళ్ళి సంబంధం చెడిపోయింది.....' జేబులోంచి మరో రేగుపండు తీస్తూ అన్నాడు కిష్టయ్య.

హఠాత్తుగా రాంబాబు చిన్నగా కేకేశాడు.

"ఒరేయ్ కిష్టయ్య..... అటు చూడు .... ఆ పరుగెత్తుతున్న అమ్మాయి సుబ్బలక్ష్మిలా

లేదూ?'

"సుబ్బలక్ష్మిలా వుండడం ఏమిటండీ గురూగారూ..... ఆమె సుబ్బలక్ష్మే!..... జుట్టు విరపోసుకుని నల్లచీర కట్టుకుని పరుగెత్తుతుందంటే అర్థం కావడంలేదా గురూగారూ?'

రాంబాబు అయోమయంగా కిష్టయ్య వంక చుసాడు.

"అంటే ఏంటి అర్థం? ..... దెయ్యం పట్టిందనా?'

"అయ్యో గురూగారూ..... మీరెప్పుడూ తెలుగు సినిమాల్లో చూడలేదా?..... ఆమె ఆత్మహత్య చేసుకోవడానికి పరిగెత్తుతుంది.....చూశారా?..... అటువైపు చెరువు ఉన్న వైపు పరుగెత్తుతుంది..... మనం ఆమెని రక్షించాలి గురూగారూ....'

ఇద్దరూ సుబ్బలక్ష్మి వేపు పరుగెత్తారు.

"ఎలారక్షించాలిరా ..... నాకు ఈత రాదుగా ....' పరుగెత్తుతూనే అన్నాడు రాంబాబు.

"భలేవారే..... చెరువులో దూకేదాకా చూస్తూ కూర్చుంటారా?..... చెర్లో దూకకముందే ఆమెని పట్టుకోవాలి!.....' కిష్టయ్య పరుగెత్తుతూనే సమాధానం చెప్పాడు.

"ఏవండీ.... ఆగండీ ..... మిమ్మల్నేనండీ--' రాంబాబు గట్టిగా అరిచాడు.

"ఆగండీ .... దూకకండీ .... మేము వస్తున్నాం .... ' అన్నాడు కిష్టయ్య.

సుబ్బలక్ష్మి వెనక్కి తిరిగి చూసింది.

"నేను ఒక్కదాన్నే దూకుతాను. మీరు విడిగా దూకండి.....'

ఆమె పరుగు వేగం పెంచింది. చెరువు సమీపించింది. రాంబాబూ, కిష్టయ్య కూడా పరుగువేగం పెంచి ఆమె చెరువులో దూకే సమయంలో చెరో రెక్కా పట్టుకున్నారు.

"వదలండి..... నన్ను వదలండి......' సుబ్బలక్ష్మి గింజుకుంది.

"ఆత్మహత్య చేసుకోడం పాపం అండీ.....' అన్నాడు కిష్టయ్య.

"ఇలా బలవంతంగా చస్తే దెయ్యాలవుతారట!!' అన్నాడు రాంబాబు.

"నేను దెయ్యం అవుతే ముందు మీ ఇద్దరినీ పట్టుకుంటా.... ' అని అంటూ ఒకసారి ఇద్దరినీ పిచ్చిబలంతో విదిలించింది. ఆ దెబ్బకి రాంబాబు అటూ, కిష్టయ్య ఇటూ పడ్డారు.

ఆమెబలానికి ఇద్దరూ ఆశ్చర్యపోయారు. ఇద్దరూ లేచి నిలబడి మళ్ళీ ఆమెని పట్టుకోబోయారు.

కానీ అప్పటికే ఆలస్యం అయిపోయింది.

సుబ్బలక్ష్మి చెంగున చెరువులోకి దూకిది.

రాంబాబూ కిష్టయ్య "కెవ్వు' మని కేకేస్తూ కళ్ళు మూసుకున్నారు.

నీళ్ళలో ధనేల్‌మని పడిన శబ్దం వినిపించింది వాళ్ళిద్దరికీ.

ఫ్రేమ్ - 20

రాంబాబు మాటిచ్చాడు

రాంబాబూ, కిష్టయ్యా మెల్లగా కళ్ళు తెరిచారు. ఎదురుగా కనబడిన దృశ్యానికి వాళ్ళ

కళ్ళు సంభ్రమంతో విప్పారాయి.

సుబ్బలక్ష్మి మోకాళ్ళ లోతు నీళ్ళలో నిలబడి వీళ్ళిద్దరివంకే కోపంగా చూస్తుంది.

"ఈ సెరువెండిపోయి శానకాలం అయ్యిందమ్మా..... ఆ పక్క పెద్ద నదుందిగా .....' అని సుబ్బలక్ష్మితో దారినపోయే దానయ్య చెప్పి తన దారిన తాను పోయాడు.

సుబ్బలక్ష్మి చెరువులోంచి బయటికి వచ్చి మళ్ళీ నది ఉండే వేపుకు పరిగెత్తబోయింది. కాని రాంబాబూ కిష్టయ్య ఆమెని మళ్ళీ చెరో రెక్కాపట్టుకున్నారు.

"ప్లీజ్ ..... మామాట వినండి ..... మీరు మళ్ళీ మమ్మల్ని విదిలించి కొట్టకండి.... మీరసలు ఎందుకు ఆత్మహత్య చేసుకోవాలని అనుకుంటున్నారో చెప్పాండి' ప్రాధేయపడుతూ అడిగాడు రాంబాబు.

"నాకు మీతో పెళ్ళి యిష్టం లేదు....' అంది సుబ్బలక్ష్మి. "మీరు మోసగాళ్ళు..... ఎవరినో అమ్మాయిని ప్రేమించి షికార్లు తిప్పారు.... ఇప్పుడు కట్నంకోసం నన్ను చేసుకోవాలని సిద్దపడుతున్నారు....'

రాంబాబు ఆశ్చర్యంగా సుబ్బలక్ష్మి వంక చూశాడు.

"మా గురూగారు అలాంటివాడు కాదండీ.... ఇక్కడ పెళ్ళిచూపులకు ఏర్పాట్లు చేశారని కూడా ఆయనకి తెలీదు. ఇంట్లో వాళ్ళ బలవంతం మీద ఆయన ఈ పెళ్ళి చూపులకి వచ్చారు.... మా గురూగారు ప్రేమించిన అమ్మాయినే పెళ్ళి చేసుకుంటారు.....' అన్నాడు కిష్టయ్య.

"అయిన నేను ఎవరినో ప్రేమించానని మీకెలా తెలుసు?' రాంబాబు సుబ్బలక్ష్మిని అడిగాడు.

"ముందు మీ ఇద్దరూ నాచేతుల్ని వదలండి చెప్తాను'

ఇద్దరూ సుబ్బలక్ష్మి చేతులు వదిలేశారు.

"నేను ఒకరోజు ఇందిరా పార్కులో ఒక అమ్మాయితో చూశాను మిమ్మల్ని..... అక్కడికి నేను నా బాయ్‌ఫ్రెండ్‌తో వచ్చాను.' "ఓ.... అర్థం అయ్యింది..... నేనేమీ మీ మార్గానికి అడ్డు రావడం లేదుగా..... మీరు ఆ అబ్బాయినే చేసుకోండి.....' అన్నాడు రాంబాబు.

వెంటనే సుబ్బలక్ష్మి వెక్కివెక్కి ఏడవడం మొదలుబెట్టింది.

"అంత అదృష్టం లేదునాకు..... ప్రేమా గీమా అంటూ నన్ను నమ్మించి అక్కడికీ ఇక్కడికీ తిప్పి ఇప్పుడేమో నన్ను చేసుకోననీ మీరు ప్రేమించిన అమ్మాయిని చేసుకుంటానని అంటున్నాడు..... నాకు ఆత్మ హత్యే శరణ్యం.....'

రాంబాబు ఆశ్చర్యంగా చూశాడు.

"సరోజని చేస్కుంటానని అంటున్నాడా?..... ఇంతకీ అతని పేరు?'

"నాగరాజు!.....'

రాంబాబూ, కిష్టయ్య అదిరిపడ్డారు. ఇద్దరూ ఒకరి ముఖాలు ఒకరు చూస్కున్నారు.